జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | 29 | మే | 2026 • పేజీలు : 7


## అకాల వర్షాలతో తడిసినా ధాన్యం కొంటాం

### జిల్లా కలెక్టర్ అంకిత్




**కొత్తగూడెం కలెక్టరేట్, మే 28,(ప్రజాజ్యోతి)** ధాన్యం సేకరణ ప్రక్రియలో క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న అడ్డంకులను అధిగమిస్తూ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నారన్నారు, రవాణా, రెవెన్యూ శాఖల సమన్వయంతో అన్నిరకాల వాహనాలను ధాన్యం రవాణాకు వినియోగిస్తున్నామని, ప్రతి రైస్ మిల్లుకు ప్రత్యేక ఇన్‌ఛార్జ్‌లను నియమించి, అదనపు హమాలీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు, మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ప్రక్రియలో ఆలస్యం జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్షాల కారణంగా ధాన్యం తడిసినా రైతులు ఆందోళన చెందవద్దని, తడిసిన ధాన్యాన్ని వెంటనే గుర్తించి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేలా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రెవెన్యూ, సివిల్ సప్లై, రవాణా శాఖలు సమన్వయం చేసుకుంటూ ధాన్యం సేకరణను పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక కోఆర్డినేటర్లు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలన్నారు.

- బోధన పక్కనబెట్టి ఇంటింటికీ తిరుగుతున్న ప్రైవేటు టీచర్లు
- టార్గెట్ల ఒత్తిడితో మానసిక ఆందోళనలో ఉపాధ్యాయులు
- గురువు చేతిలో చాక్ ఉండాలి... అడ్మిషన్ ఫారమ్ కాదు




# అడ్మిషన్ల భారం కింద... నలిగిపోతున్న గురువులు

2 లో..

సమాజాన్ని తీర్చిదిద్దే శిల్పి "గురువు". అక్షరాలను మాత్రమే కాదు... మనిషి జీవితాన్ని మలిచే మహోన్నత బాధ్యత గురువుదే. తల్లిదండ్రుల తర్వాత విద్యార్థికి దారి చూపించే వ్యక్తి ఉపాధ్యాయుడు. ఒకప్పుడు గురువు అంటే గౌరవం, క్రమశిక్షణ, జ్ఞానం, విలువలకు ప్రతీకగా భావించేవారు. కానీ మారుతున్న కాలంలో విద్య కూడా వ్యాపార పోటీ వైపు అడుగులు వేయడంతో... ఇప్పుడు అదే గురువు అడ్మిషన్ల కోసం ఇంటింటికీ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందనే ఆవేదన వినిపిస్తోంది.

• భద్రాద్రి కొత్తగూడెం , ప్రజాజ్యోతి

## పుష్కరాల నాటికి రామాలయ అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం

### రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



**భద్రాచలం టౌన్, మే 28, ప్రజాజ్యోతి** వచ్చే ఏడాది జూలైలో జరిగే గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలంలో రామాలయ అభివృద్ధి పనులు పూర్తవుతాయని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని ఆమె దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు, అధికారులు ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అంతరాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు లక్ష్మీతాయారు అమ్మవారిని, దాసాంజనేయస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సీతక్కకు, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు దేవస్థానం తరపున వేద ఆశీర్వచనం అందజేయడంతో పాటు శాలువ, తీర్ద ప్రసాదాలను అందించారు. అనంతరం విలేకర్లతో సీతక్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో

మిగతా 2 లో...

## తహసీల్దార్లు నిరుద్యోగ యువత భవిత సెల్‌ను సంప్రదించేలా చర్యలు చేపట్టాలి

- భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్



**భద్రాచలం టౌన్, మే 28, ప్రజాజ్యోతి** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు ఐటీడీఏ ఆధ్వర్యంలోని వైటీసీలో వృత్తి నైపుణ్యాల శిక్షణ అందిస్తున్నందున సంబంధిత తాసిల్దారులు మీ పరిధిలోని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులను గుర్తించి ఐటీడీఏ కార్యాలయంలోని భవితా సెల్లుకు సంప్రదించేలా తగు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ గురువారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో ఇల్లందు , ఖమ్మం, భద్రాచలం వై టి సి లలో, అశ్వరావుపేట లోని గిరిజన భవనములో నిరుద్యోగ గిరిజన యువతి యువకులకు 15 రకాల కోర్సులలో వృత్తి నైపుణ్యాలలోదాదాపు మూడు నెలల పాటు ఉచిత భోజనం వసతితో శిక్షణ అందించి ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. సంబంధిత, తహసిల్దార్లు మీ మండలం పరిధిలోని గ్రామాలలో ఉన్న గిరిజన యువతి యువకులను గుర్తించి భద్రాచలం ఐటీడీఏ లోని భవితా సెల్లు ఫోన్ నెంబర్ 6302608905, 906388994 సంప్రదించే విధంగా సహకరించాలని ఆయన కోరారు.

## త్యాగ నిరతికి, దానధర్మాలకు ప్రతీక బక్రీద్

- డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు.
- పాల్వంచ, పాత పాల్వంచ ఈద్గాల వద్ద ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన కొత్వాల దంపతులు





**పాల్వంచ, మే 28, ప్రజాజ్యోతి:** త్యాగానికి, భక్తికి, దానధర్మాలకు ప్రతీకగా ప్రపంచవ్యాప్తంగా ముస్లిం సోదరులు జరుపుకునే పవిత్ర పర్వదినం బక్రీద్ (ఈద్ ఉల్ అజ్హా) అని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డివిఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. పవిత్ర బక్రీద్ పండుగ సందర్భంగా పాల్వంచ ఇందిరా కాలనీలోని ఈద్గా వద్ద కొత్వాల శ్రీనివాసరావు, పాత పాల్వంచలోని ఈద్గా వద్ద ఆయన సతీమణి, 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి ముస్లిం సోదరులను కలుసుకుని

మిగతా 2 లో...

## పుష్కరాల నాటికి రామాలయ అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం



(మొదటి పేజీ తరువాయి...)
మేడారం సమ్మక్క సారలమ్మ గద్దెలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చసి జాతర విజయవంతంగా నిర్వహించామన్నారు. అలాగే ప్రస్తుతం వేములవాడ, భద్రాచలం, బాసర ఆలయాల అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు. గోదావరి పుష్కరాల నాటికి ఆలయాల అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఆమె వెంట భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణ, తహసీల్దారు దనియాల వెంకటేశ్వర్లు , కాంగ్రెస్ నాయకులు వెంకటరెడ్డి, అరికెల తిరుపతి ఉన్నారు.

## త్యాగ నిరతికి, దానధర్మాలకు ప్రతీక బక్రీద్

(మొదటి పేజీ తరువాయి...)
వారికి హృదయపూర్వకంగా "ఈద్ ముబారక్" తెలిపారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ, బక్రీద్ పర్వదినం త్యాగంతో పాటు అచంచలమైన భక్తి, విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. అల్లాపై ప్రవక్త ఇబ్రహీం చూపిన విశ్వాసం, అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. సమాజంలో పేదరికం, అసమానతలు తొలగి అందరూ సమానత్వంతో జీవించేలా పరస్పరం ఆదరించుకోవడమే బక్రీద్ పండుగ యొక్క అసలు సందేశమని కొత్వాల అన్నారు. మత సామరస్యం, సోదరభావం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి, 6వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ బీఎస్ రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న, కాంగ్రెస్ నాయకులు వై వెంకటేశ్వర్లు, చింతా నాగరాజు, పైడిపల్లి మహేష్, ఎస్కే చాంద్ పాషా, ఉండేటి శాంతివర్ధన్, ఎస్కే బాషా, ఎస్కే షఫీ, చింతలచెర్వు రమేష్, పాత పాల్వంచ ముస్లిం మైనారిటీ నాయకులు సయ్యద్ యాకుబ్, షేక్ జానీమియా, ఎండీ నజీర్, షేక్ రెహ్మాన్, సయ్యద్ కరీం, షేక్ ఖాజామియా, ఇమామ్ అజ్మత్ అలీ, జలీల్, యాకుబ్, మున్నా, షబ్బీర్, అలాగే కాంగ్రెస్ నాయకులు మసనం శరత్, బూసి శ్రీను, అక్కల రాంబాబు, తిరుమలరావు, యాటా నాసి తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన నల్ల సురేష్ రెడ్డి

- త్యాగం, భక్తి, సోదరభావానికి ప్రతీక బక్రీద్ పండుగ – నల్ల సురేష్ రెడ్డి



**పాల్వంచ, మే 28, ప్రజాజ్యోతి:** పవిత్ర బక్రీద్ (ఈద్ ఉల్ అజ్హా) పర్వదినాన్ని పురస్కరించుకుని శ్యామల గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఫౌండర్ కం ఛైర్మన్ నల్ల సురేష్ రెడ్డి ముస్లిం సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నల్ల సురేష్ రెడ్డి మాట్లాడుతూ, బక్రీద్ పండుగ త్యాగానికి, అచంచలమైన విశ్వాసానికి, దానధర్మాలకు ప్రతీకగా నిలిచే గొప్ప పర్వదినమని అన్నారు. మానవత్వం, పరస్పర గౌరవం, సోదరభావాన్ని చాటి చెప్పే ఈ పవిత్రమైన రోజు సమాజానికి ఎంతో మంచి సందేశాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. అల్లాపై ప్రవక్త ఇబ్రహీం చూపిన అంకితభావం, విశ్వాసానికి గుర్తుగా జరుపుకునే బక్రీద్ ప్రతి ఒక్కరిలో సేవాభావం, త్యాగనిరతి పెంపొందించే పండుగ అని ఆయన అన్నారు. మతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి ఆనందంగా పండుగలు జరుపుకోవడం భారతదేశ సంస్కృతికి ప్రతీక అని చెప్పారు. ప్రస్తుత సమాజంలో ప్రేమ, ఐక్యత, పరస్పర సహకారం ఎంతో అవసరమని, బక్రీద్ పర్వదినం అలాంటి విలువలను మరింత బలోపేతం చేస్తుందని నల్ల సురేష్ రెడ్డి అన్నారు. ఈ పవిత్ర పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ, ముస్లిం సోదర సోదరీమణులందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. "ఈద్ ముబారక్" అంటూ అందరికీ శాంతి, సౌభాగ్యం, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.

- బోధన పక్కనబెట్టి ఇంటింటికీ తిరుగుతున్న ప్రైవేటు టీచర్లు
- టార్గెట్ల ఒత్తిడితో మానసిక ఆందోళనలో ఉపాధ్యాయులు
- గురువు చేతిలో చాక్ ఉండాలి... అడ్మిషన్ ఫారమ్ కాదు




# అడ్మిషన్ల భారం కింద... నలిగిపోతున్న గురువులు

**సమాజాన్ని తీర్చిదిద్దే శిల్పి "గురువు". అక్షరాలను మాత్రమే కాదు... మనిషి జీవితాన్ని మలిచే మహోన్నత బాధ్యత గురువుదే. తల్లిదండ్రుల తర్వాత విద్యార్థికి దారి చూపించే వ్యక్తి ఉపాధ్యాయుడు. ఒకప్పుడు గురువు అంటే గౌరవం, క్రమశిక్షణ, జ్ఞానం, విలువలకు ప్రతీకగా భావించేవారు. కానీ మారుతున్న కాలంలో విద్య కూడా వ్యాపార పోటీ వైపు అడుగులు వేయడంతో... ఇప్పుడు అదే గురువు అడ్మిషన్ల కోసం ఇంటింటికీ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందనే ఆవేదన వినిపిస్తోంది.**

● భద్రాద్రి కొత్తగూడెం , ప్రజాజ్యోతి

విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు ఇప్పుడు "మా స్కూల్లో చేర్పించండి" అంటూ తల్లిదండ్రుల ఇళ్ల వద్దకు వెళ్లి అడ్మిషన్ల కోసం ఒప్పించాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. సెలవులు వచ్చినా విశ్రాంతి లేకుండా అడ్మిషన్ల టార్గెట్లతో తిరగాల్సి వస్తోందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని అనేక ప్రైవేటు పాఠశాలల్లో ప్రతి టీచర్‌కు నిర్దిష్ట సంఖ్యలో అడ్మిషన్లు తీసుకురావాలని యాజమాన్యాలు లక్ష్యాలు నిర్దేశిస్తున్నట్లు సమాచారం. కొందరికి ఐదు... మరికొందరికి పది... ఇంకొన్ని చోట్ల అంతకంటే ఎక్కువ అడ్మిషన్ల బాధ్యతలు అప్పగిస్తున్నారనే చర్చ జరుగుతోంది. దీంతో ఉపాధ్యాయులు బోధనకన్నా మార్కెటింగ్ ప్రతినిధుల్లా మారిపోయామనే భావనలో ఉన్నారు. ఎండలు మండుతున్న గ్రామాలు, కాలనీలు తిరుగుతూ తల్లిదండ్రులను కలవాల్సి వస్తోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఫోన్ కాల్స్, అడ్మిషన్ ఫాలోఅప్స్, యాజమాన్య సమీక్షలు... ఇలా ఉదయం నుంచి రాత్రి వరకు ఒత్తిడి కొనసాగుతోందని అంటున్నారు. ఇంతటి బాధ్యతల మధ్య పనిచేస్తున్నప్పటికీ అనేక మంది ప్రైవేటు టీచర్ల వేతనాలు మాత్రం చాలా తక్కువగానే ఉన్నాయని తెలుస్తోంది. నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల మధ్యే జీతాలు తీసుకుంటున్న ఉపాధ్యాయులు చాలామంది ఉన్నారని విద్యావర్గాలు చెబుతున్నాయి. తాము పనిచేస్తున్న పాఠశాలల్లోనే తమ పిల్లలను చదివించాలన్నా సరైన ఫీజు రాయితీలు లభించడం లేదని కొందరు వాపోతున్నారు. "రోజంతా ఇతరుల పిల్లలకు పాఠాలు చెబుతున్నాం... కానీ మా పిల్లల చదువుల కోసం అప్పులు చేయాల్సి వస్తోంది" అంటూ పలువురు ఉపాధ్యాయులు మౌనంగా బాధపడుతున్నారని సహచరులు చెబుతున్నారు. మరోవైపు విద్యాసంస్థల మధ్య పెరుగుతున్న పోటీ, విద్యార్థుల సంఖ్య తగ్గడం, నిర్వహణ వ్యయాలు అధికమవడం వల్ల యాజమాన్యాలపైనా ఒత్తిడి ఉందని కొందరు నిర్వాహకులు చెబుతున్నారు. అయితే ఆ భారం మొత్తం ఉపాధ్యాయులపై మోపకుండా సమతుల్యత పాటించాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు సూచిస్తున్నారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సంక్షేమం, పని గంటలు, వేతన భద్రత, మానసిక ఆరోగ్యం వంటి అంశాలపై ప్రభుత్వం, విద్యాశాఖ మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గురువుల జీవితాలు ఒత్తిడితో నిండిపోతే... దాని ప్రభావం మొత్తం సమాజంపైనే పడుతుందని పలువురు హెచ్చరిస్తున్నారు.

## రైతు నడ్డివిరుస్తున్న మద్దతు ధర

- స్వామినాథన్ సిఫారసులకు అనుగుణంగా పంటలకు మద్దతు ధర ప్రకటించాలి... కెచ్చల రంగారెడ్డి....ఎస్ కే యం జాతీయ నాయకులు
- ఎస్ కేయం, ఎస్ఐయుకెఎస్ ల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం





**అశ్వారావుపేట, మే 28, ప్రజాజ్యోతి :** స్వామినాథన్ సిఫారసులకు అనుగుణంగా పంటలకు మద్దతు ధర ప్రకటించాలని ఎస్ కే యు జాతీయ నాయకులు కెచ్చల రంగారెడ్డి అన్నారు. ఎస్‌కేయు, ఎస్ఐయుకెఎస్ ల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా బుధవారం మండలంలోని నందిపాడు గ్రామంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌కేఎం జాతీయ నాయకులు కెచ్చల రంగారెడ్డి మాట్లాడుతూ రైతులకు పంటల ఉత్పత్తి వ్యయానికి అనుగుణంగా స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు కనీస మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధరలు రైతులకు నష్టాలను మిగులుస్తున్నాయని, పెరుగుతున్న సాగు ఖర్చులతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతు పండించిన ప్రతి పంటకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర కల్పించాలని, రైతు సమస్యలపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని కోరారు. రైతు సంఘాల నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ కేయం జిల్లా నాయకులు కల్లూరు కిషోర్, గోకినేపల్లి ప్రభాకర్, ముద్ద భిక్షం, పోతుగంటి లక్ష్మణ్, టియుసిఐ నాయకులు, పివైఎల్ నాయకులు కే రామకృష్ణ, పిఓడబ్ల్యూ కే పద్మ, స్థానిక నాయకులు శ్రీరాములు కారం ధర్మ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎంపీల సమస్యలు పరిష్కరించండి

- గ్రామీణ వైద్యులపై తనిఖీలు నిలిపివేయండి
- ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన గ్రామీణ వైద్యులు



**చర్ల, మే 28 (ప్రజా జ్యోతి):** చర్ల మండలంలో గ్రామీణ వైద్యుల ప్రథమ చికిత్స కేంద్రాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ప్రత్యేక తనిఖీలను నిలిపివేయాలని కోరుతూ ఆర్ఎంపీ, పీఎంపీ, సీపీ అండ్ ఈపీ సంఘం నాయకులు భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఇటీవల కాలంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తూ భారీ జరిమానాలు విధిస్తున్నారని, దీని వలన గ్రామీణ వైద్యులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ మానసిక ఆందోళనకు గురవుతున్నారని సంఘ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు పి. వెంకటేశ్వర్లు, మండల గౌరవ అధ్యక్షులు కొప్పుల రాంబాబు, మండల అధ్యక్షులు తాళ్లూరి రంగారావు, మండల ప్రధాన కార్యదర్శి ఎడారి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు ఉన్నత చదువులు పూర్తి చేసి కూడా ఉద్యోగావకాశాలు లేక స్వయం ఉపాధి మార్గాన్ని ఎంచుకున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో వైద్యసేవలు లేకపోయిన సందర్భాల్లో తాము ప్రజలకు మొదటి దశలో వైద్య సేవలు అందిస్తూ అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడుతున్నామని పేర్కొన్నారు. ఎంబీబీఎస్, ఎంఎస్, ఎండీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్ తదితర విభాగాల్లో నిపుణులైన వైద్యుల వద్ద ఐదు నుంచి పది సంవత్సరాలపాటు పనిచేసిన అనుభవంతోనే తాము గ్రామీణ ప్రాంతాల్లో ప్రథమ చికిత్స కేంద్రాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. గత 20 నుంచి 30 సంవత్సరాలుగా గ్రామీణ ప్రజలకు సేవలందిస్తూ అనేక కుటుంబాలు తమపై ఆధారపడి జీవిస్తున్నాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో అర్ధరాత్రి సమయంలోనూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ వైద్యులను గుర్తించి ప్రత్యేక శిక్షణ అందించాలని, కొత్తగా వస్తున్న వ్యాధులపై అవగాహన కల్పించాలని, ప్రజారోగ్య పరిరక్షణలో తమ సేవలను ప్రభుత్వం వినియోగించుకోవాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఆకస్మిక తనిఖీలు, జరిమానాల కారణంగా గ్రామీణ వైద్యుల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందిస్తున్న తమపై అధికారులు ఒత్తిడి తీసుకురావడం బాధాకరమని తెలిపారు. గ్రామీణ వైద్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు సంఘ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోచం అనంతరాములు, బత్తుల వెంకటేశ్వర్లు, పుప్పాల రంజిత్ కుమార్, కిరణ్, దాగం శ్రీనివాసరావు, బొల్ల వెంకటేశ్వర్లు, ఇర్పా మురళి, సాధనపల్లి మహేష్, చింత కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్లను చల్లబరిచేందుకు భద్రాచలం డిఈ జీవన్ కుమార్ చర్యలు

- ఎర్తింగ్ పైపులకు నీళ్లు పడుతున్న విద్యుత్ సిబ్బంది



**భద్రాచలం టౌన్, మే 28, ప్రజాజ్యోతి** భద్రాచలంలో అధిక ఉష్ణోగ్రత కలిగిన ఎండలను తట్టుకోలేక ప్రజలు అధికంగా విద్యుత్తును వాడడం వలన ట్రాన్స్‌ఫార్మర్ల మీద లోడ్ పడుతూ అధిక వేడికి గురి అవుతున్నాయి. దీనివలన ప్రజలకు విద్యుత్ అంతరాయములు కలగకుండా హెచ్చుతగ్గు సమస్యలు రాకుండా విద్యుత్తు శాఖ డీఈ జీవన్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యుత్ అధికారులు, కార్మికులు అహర్నిశలు మండుటెండను సైతం లెక్కచేయకుండా నిరంతరం శ్రమిస్తున్నారు. ఇందుకు గాను ఎర్త్ పైపులకు నిరంతరం నీటిని అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఈ నరసింహారావు, ఏఈ రాజారావు , ఉపేందర్, వెంకట్ రాజు, రామకృష్ణ, ఉదయ్, శ్రీను, త్రినాద్ రెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.

## ప్రపంచ తెలుగు మహాసభల సమన్వయకర్తగా సురేష్ బాబు తోటమల్ల



**భద్రాచలం టౌన్, మే 28 ప్రజాజ్యోతి** భద్రాచలం శ్రీశ్రీ కళావేదిక అధ్వర్యంలో జూన్ 6 ,7 తేదీలలో రాజమహేంద్రవరం లోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ లో నిర్వహించే 7 వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల సమన్వయకర్తగా భద్రాచలం పట్టణానికి చెందిన భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు ,ప్రముఖ కవి సురేష్ బాబు తోటమల్ల నియమితులయ్యారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికను సురేష్‌కు శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డా .కత్తిమండ ప్రతాప్, జాతీయ ఆధ్యక్షురాలు ఈశ్వరీభూషణం, జాతీయ ప్రణాళికాధికారి డా .బి .పార్థసారధిలు నియామక పత్రం పంపించారు. సురేష్ బాబు మాట్లాడుతూ సమన్వయకర్తగా నియమించటం పట్ల నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలుపుతూ మహాసభల విజయవంతానికి కృషి చేస్తానని తెలిపారు.

## ఎన్టీఆర్ జయంతి వేడుకలు

**ఇల్లందు, మే 28, ప్రజాజ్యోతి:** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకలను గురువారం నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ వంశీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక టిడిపి పార్టీ కార్యాలయంలో ముద్రగడ వంశీ, విజయలక్ష్మి నగర్ పంచాయతీ సర్పంచ్ చందావత్ రమేష్ బాబు లు జన్మదిన కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాలకు రాజ్యాధికారం అందించింది ఎన్టీఆర్ అన్నారు. 1923 మే 28వ తేదీన కృష్ణాజిల్లా నిమ్మకూరు గ్రామంలో జన్మించారని, ఆ తర్వాత సినీ రంగంలో తిరుగులేని శక్తిగా తెలుగు ప్రజల ఆధార అభిమానులు అందుకొని నటసార్వభౌమ గుర్తింపు పొందాలని 59 సంవత్సరాల వయసులో తెలుగు ప్రజల కష్టాలను చూసి సినీ రంగం నుండి వచ్చి ఎంతో తప్పించి పోయి 29మార్చి 1982 లో తెలుగుదేశం పార్టీ స్థాపించి తొమ్మిది నెలల కాలంలోనే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి తీసుకువచ్చి బడుగు బలహీన వర్గాలకు ఎంతో ఉపయోగకరమైన పాలన అందించే బడుగులకు రాజ్యాధికారం అందించిన నేతగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. అటు తెలుగోడు అంటే దేశంలోనే గుర్తింపు పొంది పాలన అందించిన మహనీయుడు అని, ఇలాంటి చరిత్ర కలిగిన నాయకుని భారతరత్న ఇచ్చి గౌరవించాలని డిమాండ్ చేశారు. పేదోడికి పట్టేడన్నం పెట్టిన చరిత్ర ఎన్టీఆర్ కే దక్కుతుందని, రెండు రాష్ట్రలో మెజారిటీ నాయకత్వం ఎన్టీఆర్, తెలుగుదేశం పార్టీ అందించ్చారని గుర్తు చేశారు. రామన్న రోజుల్లో తెలంగాణా రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మైపా బాలరాజు, శ్యామ్ తివారీ, బాబు, దగ్గుల లింగయ్య, వేల్పుల ప్రశాంతి, కంది రవి, దాసరి గోపాలకృష్ణ, వాసం వినీత్, రాజేందర్ పాల్గొన్నారు.



## అర్హులైన వ్యవసాయ కూలీలందరికీ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం స్వామి




**భద్రాచలం టౌన్, మే 28, ప్రజాజ్యోతి** ఆత్మీయ భరోసా పథకాన్ని అర్హులైన వ్యవసాయ కార్మికులందరికీ అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం స్వామి డిమాండ్ చేశారు. గురువారం వ్యవసాయ కార్మిక సంఘం పట్టణ మహాసభ మడకం పద్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం పట్టణం శివారు కాలనీల నుండి వందలాది మంది పేదలు చుట్టుపక్క గ్రామాల్లో వ్యవసాయ పనులకు వెళ్లి ఉపాధి పొందుతున్నారని అన్నారు. భద్రాచలం గ్రామపంచాయతీ పరిధిలో వందలాది మందికి ఉపాధికార్డులు ఉన్నప్పటికీ ప్రభుత్వం పనులు చూపించడం లేదని అన్నారు. అర్హులైన వారందరికీ ఉపాధి పనులు చూపించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పనులు చేసే వ్యవసాయ కార్మికులకు ఆత్మీయ భరోసా పథకం కింద ప్రభుత్వ హామీ మేరకు సంవత్సరానికి 12,000/-లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సిఐటియు జిల్లా నాయకులు ఎం.బి.నర్సారెడ్డి మాట్లాడుతూ వి.బి.జి.రామ్ జి ఉపాధి చట్టాన్ని రద్దు చేయాలని, కార్మికులు కర్షకులు ఐక్యతతో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీని 15 మంది సభ్యులతో ఎన్నుకోవడం జరిగింది. ఈ మహాసభలో ఐద్వా జిల్లా అధ్యక్షులు డి సీతాలక్ష్మి, వార్డు మెంబర్ ఇరప అనసూయ,ఐద్వా సీనియర్ నాయకులు నాదెళ్ల లీలావతి, గిరిజన సంఘం పట్టణ కార్యదర్శి కుంజా శ్రీనివాస్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు కోరాడ శ్రీనివాస్ , ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి రవీందర్, సిఐటియు నాయకులు చాట్ల శ్రీనివాస్ రాఘవయ్య రామకృష్ణ పాల్గొన్నారు.

## కేరళ మాజీ సీఎం ఇంట్లో ఈడీ దాడులకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

**భద్రాచలం టౌన్ , మే 28 ప్రజాజ్యోతి** కేరళ మాజీ సీఎం పినయర్ విజయ్ ఇంట్లో ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టరేట్ ఆధ్వర్యంలో దాడులు చేయడాన్ని నిరసిస్తూ భద్రాచలంలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన సభలో ఎంబీ నర్సారెడ్డి మాట్లాడుతూ దేశంలోనే నీతి నిజాయితీకి ప్రతిరూపంగా నిలిచిన మాజీ ముఖ్యమంత్రి విజయ్ పై ఈడి దాడులు సిగ్గుచేటని అన్నారు. కేంద్రంలో ఉన్న ఇండియా కూటమి కేరళ ఉన్న కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ రెండు ఒకటై సిపిఎం నాయకులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. కేరళ చరిత్రలోనే గతంలో ఎన్నడు లేని విధంగా రెండుసార్లు ముఖ్యమంత్రిగా పరిపాలించిన ఘనత పినరై విజయ దక్కుతుందని అన్నారు. సిపిఐ ఎం నాయకత్వంలో పది సంవత్సరాలు కేరళని పరిపాలించిన విజయ్ దేశంలోనే పేదరికం లేని రాష్ట్రంగా కేరళని తీర్చిదిద్దారని అన్నారు. పినరై విజయ్ పై ఈడి దాడులు జరుగుతున్న సమయంలో ఎటువంటి పిలుపులు లేకుండానే వేలాదిమంది ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి కేంద్ర దర్యాప్తు సంస్థలపై నిరసనకు దిగారని అన్నారు. భవిష్యత్తులో కాక్రోజ్ జనతా పార్టీ వంటి యువజన ఉద్యమాలతో బిజెపికి గడ్డు కాలం తప్పదని నర్సారెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు డి సీతాలక్ష్మి పట్టణ కమిటీ సభ్యులు నాదెండ్ల లీలావతి ఉస్తేల జ్యోతి కుంజ శ్రీను ధనకొండ రాఘవయ్య కొరడా శ్రీనివాస్ చాట్ల శ్రీను భూపేందర్ కనక శ్రీ 20వ వార్డు మెంబర్ ఇరప అనసూర్య ఎస్ఎఫ్ఐ నాయకులు రవీందర్ శాఖ కార్యదర్శి డి రామకృష్ణ కాక రమణ సౌభాగ్యం పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

**టేకులపల్లి,మే28,ప్రజాజ్యోతి:** టేకులపల్లిలో బక్రీద్ పండుగ వేడుకలను ముస్లింలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక బేతంపూడి గ్రామంలోని దర్గాలో ముస్లిలు సామూహిక గా ప్రార్థనలు నిర్వహించారు. ప్రవక్త హజరత్ ఇబ్రహీం త్యాగం ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఇస్లాం సూచించిన సన్మార్గంలో నడిచి పేదలకు దానలు, ధర్మాలు చేయాలని, పేదరికం లేని సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మతం పెద్దలు పాల్గొన్నారు.



## మహిళలకు చీరలను పంపిణీ చేసిన కౌన్సిలర్





**ఇల్లందు, మే 28, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేసే ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీని గురువారం మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో వార్డు కౌన్సిలర్ దండు సారయ్య మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం చీరలను పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. మహిళలు చీరలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ప్రతి ఏటా మహిళలకు సద్దుల బతుకమ్మను పురస్కరించుకొని చీరలను పంపిణీ చేసేవారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రెండేళ్ల అనంతరం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పీ కృష్ణవేణి, ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీ షిర్డీ సాయిబాబా మందిరాలలో ప్రత్యేక పూజలు

- అభిషేకాలు అన్నదానాలను భారీగా పాల్గొన్న భక్తులు



**అశ్వారావుపేట, మే 28, ప్రజాజ్యోతి :** మండలంలోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరాలలో సందర్భంగా అశ్వారావుపేట మండలంలోని గురువారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు భారీ సంఖ్యలో ఆలయాలకు చేరుకుని బాబా దర్శనం చేసుకున్నారు. వినాయకపురం గ్రామంలో ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరం లో ఉదయం నుంచి భక్తులు పూజలలో పాల్గొన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని జంగారెడ్డిగూడెం రోడ్డులో ఉన్న శ్రీ జ్ఞాన సాయిబాబా మందిరంలో కొలువుతీరిన సాయినాధునికి పాలు, పెరుగు, తేనె, పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించి, అనంతరం ప్రత్యేక అలంకరణలు చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య హారతులు, భజనలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి.అలాగే ఆలయాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మహిళలు, యువకులు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు సాయిబాబా ఆశీస్సులతో కుటుంబాలకు శాంతి, సౌభాగ్యం కలగాలని ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ షిర్డీసాయి సేవా సమితి సభ్యులు పంది హరిబాబు, మంగదొడ్డి మురళీకృష్ణ, రమాదేవి, పృథ్వి, నవీన్, గౌరీ, పావని,స్వప్న అప్పారావు, శాంతకుమారి పాల్గొన్నారు.

## 50% రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు



**చర్ల,మే 28: (ప్రజా జ్యోతి ):** చర్ల మండల రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చర్ల వ్యవసాయ అధికారి లావణ్య తెలిపారు. భూమి సారాన్ని పెంపొందించడంతో పాటు పంట దిగుబడులు మెరుగుపడేందుకు పచ్చిరొట్ట పంటలు ఎంతో ఉపయోగపడతాయని ఆమె అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వ్యవసాయ భూముల్లో పచ్చిరొట్ట పంటలను సాగు చేయాలని సూచించారు.జిలుగు విత్తనాలు 30 కిలోల బ్యాగ్ రూ. 2452.50కు, పిల్లిపెసర విత్తనాలు 20 కిలోల బ్యాగ్ రూ.1995కు రైతులకు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీ సదుపాయాన్ని ప్రతి రైతు వినియోగించుకోవాలని కోరారు.విత్తనాలు పొందదలచిన రైతులు తప్పనిసరిగా పట్టా పాసుపుస్తకం, ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. ఆసక్తి గల రైతులు సమీప వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించి వెంటనే నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి లావణ్య తెలిపారు.

# సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల ఇబ్బందులు

- డబ్బులు ఇస్తేనే సర్టిఫికెట్లు పాయం సత్య నారాయణ
- ఆదివాసి విద్యార్థుల సర్టిఫికెట్ల జారీలో అవకతవకలు
- ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు గొండ్వానా సంక్షేమ పరిషత్ నాయకుల ఫిర్యాదు



**చర్ల, మే 28 (ప్రజా జ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో ఆదివాసి విద్యార్థుల కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో జరుగుతున్న అవకతవకలపై భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు గొండ్వానా సంక్షేమ పరిషత్ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. చర్లలో ఒక ప్రైవేట్ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేను కలిసి ఆదివాసి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.ఈసందర్భంగా గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ మాట్లాడుతూ చర్ల తహసీల్దార్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి షెడ్యూల్ చట్టాల అమలులో నిర్లక్ష్యం కొనసాగుతోందని ఆరోపించారు. ఆదివాసి సంఘాలు పలు మార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ నెలల తరబడి సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆదివాసి చట్టాలను అమలు చేయాల్సిన అధికారులు వాటిని పట్టించుకోకుండా వ్యవహరించడం బాధాకరమని అన్నారు.చర్ల మండలంలోని కొన్ని జీపీఓ కార్యాలయాల్లో ముఖ్యంగా సుబ్బంపేట జీపీఓ పరిధిలో ఆదివాసి విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో తీవ్ర ఇబ్బందులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులను కార్యాలయాల చుట్టూ తిప్పుతూ మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. డబ్బులు ఇచ్చిన వారికి వెంటనే సర్టిఫికెట్లు జారీ చేస్తూ, డబ్బులు ఇవ్వని వారిని అనవసరంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు.ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత లేకపోవడం వల్ల పేద ఆదివాసి విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారుల పని తీరు మారకపోతే జూన్ నెలలో చర్ల రెవెన్యూ కార్యాలయాన్ని ముట్టడించే కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఆదివాసి విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ ఇర్పా రాజు, జీఎస్పీ జిల్లా కార్యదర్శి గొంది లీలా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఈతవాగు వంతెన పనులు త్వరలో ప్రారంభం



**చర్ల, మే 28: (ప్రజా జ్యోతి ):** భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ .తెల్లం వెంకట్రావు గురువారం చర్ల మండలంలోని ఈతవాగు ప్రాంతాన్ని సందర్శించి ఈత వాగు లో లెవెల్ వంతెనను పరిశీలించారు అనంతరం ఈతవాగుపై ప్రతిపాదిత హై లెవల్ వంతెన నిర్మాణ పనుల స్థలాన్ని పరిశీలించారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న రాకపోకల సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా ప్రభుత్వం ముందడుగు వేసిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ హై లెవల్ వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసినట్లు ఆయన వెల్లడించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వర్షాకాలంలో ఈతవాగు ఉద్ధృతంగా ప్రవహించడం వల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారని , రైతులు తమ వ్యవసాయ పనులు నిర్వహించడంలో సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందుకోవడంలో కూడా ఆటంకాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులు మంజూరు చేయించామని చెప్పారు.ఈతవాగుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే వర్షాకాలంలో కూడా ప్రజలకు అంతరాయం లేకుండా రాకపోకలు కొనసాగుతాయని, గ్రామాల మధ్య అనుసంధానం మెరుగుపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ వంతెన వల్ల విద్య, వైద్యం, వ్యవసాయం వ్యాపార రంగాలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు.అనంతరం అధికారులు,స్థానిక ప్రజలతో కలిసి ఎమ్మెల్యే పనుల స్థలాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేసి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పనులు చేపట్టాలని సూచించారు.ప్రభుత్వం ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు, చీమల మర్రి మురళీకృష్ణ ,బ్రహ్మానంద రెడ్డి, లంక రాజు, ముమ్మినేని అరవింద్, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## స్వామినాథన్ సిఫారసులు అమలు చేయాలి

- రైతులను నట్టేట ముంచే విధానాలను అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వం




**టేకులపల్లి,మే28, ప్రజాజ్యోతి:** హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షులు గుగులోత్ రాంచందర్ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.గురువారం టేకులపల్లి బోడు క్రాస్ రోడు లో ఎస్పిఎం ఆర్డర్ పత్రాలను ఏఐకేఎంఎస్ నాయకుల అధ్యర్యంలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గం ఉప సంఘం 14 రకాల పంటల మద్దతు ధర ప్రకటించిందని అది రైతులకు గిట్టుబాటు ధర కాదు అని ఆయన అన్నారు.రైతులను ఆదుకుంటామని కేంద్రంలో అధికారం చేపట్టిన బిజెపి, రైతులను నట్టేట ముంచే విధానాలను అవలంభిస్తోందని దుయ్యబట్టారు.రాష్ట్రంప్రభుత్వం బీజేపీ కి వంత పాడుతోందని విమర్శించారు.స్వామినాథన్ ప్రఖ్యాత విదేశీ సంస్థల్లో, గుర్తింపు, పొందిన శాస్త్రవేత్తల నేతృత్వంలో ఐరోపాలో పనిచేసి సకల సౌకర్యాలను విడిచిపెట్టి భారతదేశానికి వచ్చారని చెప్పారు. ప్రముఖ వరి పరిశోధన కేంద్రం కటక్ పరిశోధకునిగా మొదలుపెట్టి అఖిల భారత స్థాయిలో ఉన్నత స్థాయికి ఎదగడం ఆయన మేదస్సుకు, స్వయం కృషికి నిదర్శనమన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం స్వామినాథన్ సిఫారసుల అనుగుణంగా రైతుకు కనీస మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు ఈనెల 27 నుండి 31 వరకు ప్రతి గ్రామంలో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఆర్డర్ కాపీలను దగ్ధం చేయాలని రైతాంగానికి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు ఎట్టి.నరసింహా రావు,నాయకులు బానోత్ వెంకటరామ్,ఆంగోత్ బాలు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు,మహిళా సంఘం మండల అధ్యక్షురాలు గుగులోత్ సోని తదితరులు పాల్గొన్నారు.

# త్యాగస్ఫూర్తిని చాటిన బక్రీద్ వేడుకలు






- **భక్తిశ్రద్ధలతో పర్వదిన వేడుకల నిర్వహణ**

**అన్నపురెడ్డిపల్లి, మే 28, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల వ్యాప్తంగా బక్రీద్ పండుగ వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని పలు గ్రామాల ముస్లిం సోదరులు ఈద్గా మైదానాలు, మసీదులకు చేరుకుని ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా మండల ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు షేక్ సుభాని మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగం, భక్తి, విశ్వాసానికి ప్రతీక అని అన్నారు. మహ్మద్ ప్రవక్త బోధించిన సోదర భావం, పరస్పర గౌరవం, సమైక్యతను అందరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. పండుగ ద్వారా సేవాభావం, పేదల పట్ల దాతృత్వం, మానవతా విలువలు మరింత బలపడతాయని పేర్కొన్నారు. పండుగ సందర్భంగా ముస్లిం కుటుంబాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. చిన్నారులు, యువత కొత్త దుస్తులతో వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి పండుగను ఆనందంగా జరుపుకున్నారు. గ్రామాల్లో పరస్పర ప్రేమాభిమానాలు, సామరస్య వాతావరణం వెల్లివిరిసింది. నమాజ్ కార్యక్రమాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై విజయ్ సింహారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని పర్యవేక్షించారు.

## స్నేహితురాలికి ఆపన్న హస్తం...

- **గెట్ టు గెదర్లో రూ.32,500 సేకరించి స్నేహితురాలికి అప్పగించిన స్నేహితులు**



**బూర్గంపహాడ్, మే 28 (ప్రజాజ్యోతి):** స్నేహాని కన్న మిన్న లోకాన లేదురా...కడదాక నీడలాగా నిను వీడిపోదురా...నీ గుండెలో పూచేటిది...నీ శ్వాసగా నిలిచేటిది ఈ స్నేహ మొక్కటేనురా...అన్న నానుడిని మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ 2006–2007 పదవతరగతి బ్యాచ్కు చెందిన పూర్వ విద్యార్థులు నిజం చేశారు. చింతచిగురు కోసే క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారిపడి నడుం విరిగిపోయి మంచాన పడిన తన స్నేహితురాలికి ఆపన్నహస్తం అందించి స్నేహానికి ప్రతీకగా నిలిచారు. ఆంధ్రాలోని కుక్కునూరుకు చెందిన ఆవుల నాగమణి 2022లో జరిగిన ప్రమాదంలో చెట్టుపై నుంచి కిందపడి నడుం విరిగి మంచానపడింది. దీంతో ఆమె కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. ఇటీవల తన స్నేహితులు పాల్వంచలోని పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద 50 మందితో గెట్ టు గెదర్ నిర్వహించారు. ఆ సమయంలో తోటి స్నేహితులు ఎస్ఎస్ హెల్పింగ్ నేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు తాళ్ల రాజశ్రీరెడ్డి సహకారంతో పల్లంటి రమేష్, ఇనుమల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తోటి మిత్రుల నుంచి 32,500 నగదు సేకరించారు. ఆ మొత్తం నగదుతో పాటు మూడు నెలలకు సరిపోను నిత్యావసర సరుకులు తీసుకుని కుక్కునూరులో ఉన్న నాగమణి నివాసానికి వెళ్లి అందజేసి తమ స్నేహాన్ని చాటుకున్నారు. అంతేకాకుండా స్నేహితురాలి కుటుంబానికి తామంతా అండగా ఉంటామని... ఎప్పుడు ఏ కష్టమొచ్చినా స్నేహితులుగా మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. ఎస్ఎస్ హెల్పింగ్ నేచర్ ఫౌండేషన్ స్థాపించిన రాజశ్రీ రెడ్డి స్నేహితులే కాకుండా ఆపదలో ఎవరున్నా... ఎలాంటి కష్టం వచ్చినా తమవంతు సాయం అందిస్తూ పదిమందిచే శభాష్ అనిపించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో తోటి స్నేహితులు ఇలేక, మల్లేశ్వరి, రాధ, లక్ష్మి , పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో ముగిసిన బక్రీద్ వేడుకలు

- **త్యాగానికి ప్రతీక ఈదుల్ ఉల్ అజ్హా : ప్రముఖ రచయిత ఎండి ఉస్మాన్ ఖాన్**





**ములకలపల్లి, మే 28 ప్రజాజ్యోతి:** మండల వ్యాప్తంగా గురువారం పవిత్ర ఈదుల్ ఉల్ అజ్హా (బక్రీద్) వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే ముస్లిం సోదరులు ఈద్గా మైదానాలకు చేరుకుని ప్రత్యేక నమాజులు నిర్వహించారు. ములకలపల్లి, జగన్నాథపురం ఈద్గాలలో ముస్లింలు సామూహిక నమాజులు ఆచరించారు. అనంతరం పరస్పరం ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. త్యాగానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండుగ సందర్భంగా పేదలకు ఆహారం పంపిణీ చేశారు. జగన్నాథపురంలో జరిగిన వేడుకల్లో ప్రముఖ రచయిత ఎండి ఉస్మాన్ ఖాన్ మాట్లాడుతూ, "బక్రీద్ పండుగ త్యాగం, మానవత్వం, సోదరభావానికి ప్రతీక. సమాజంలో ప్రేమ, పరస్పర గౌరవాన్ని పెంపొందించే సందేశాన్ని బక్రీద్ ఇస్తుందన్నారు. అనంతరం ఒకరికి ఒక్కరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సహోదరులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## ఘనంగా ఈదుల్ అదా వేడుకలు....

- **భారీ సంఖ్యలో పాల్గొన్న ముస్లిం సోదరులు.**



**అశ్వాపురం,మే 28. ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,అశ్వాపురం మండల కేంద్రంలోని మంచికంటినగర్ లో అశ్వాపురం జామా మసీద్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈద్గా ప్రాంగణంలో ఈదుల్ అదా (బక్రీద్ ) నమాజులు మండలంలోని ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మత గురువు జమాల్ మాట్లాడుతూ, త్యాగానికి ప్రతిరూపమైన ఈ బక్రీద్ పండగ పర్వదినాన దానధర్మాలు, కుర్బానీ చేయడంతో పాటు మనోవాంఛ, స్వార్థం, అసూయ,రాగద్వేషాలు విడిచిపెట్టి పరమత సహనాన్ని పాటించి, అందరితో సోదర భావంతో, జాలి, దయా, కరుణ అలవాట్లతో మెలగాలని సూచించారు. అదేవిధంగా బక్రీద్ పండగ సారాంశమును వివరిస్తూ ఇబ్రహీం తన కుమారుడు ఇస్మాయిల్ ప్రాణ త్యాగానికి సిద్ధమైన తరుణంలో తన త్యాగానికి మెచ్చుకొని అల్లాహ్ ఆదేశాలు అనుసారం ఒక వంటేను బలిదానం చేయమని చెబుతారు. ఈ విధంగా త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండగను పురస్కరించుకొని యావత్ ముస్లిం సోదరులందరూ బక్రీద్ పండగ పర్వదిన రోజు వంటే, ఆవు,ఎద్దు, గొర్రె, మేక వంటి జంతువులను బలిదానం చేసి అందులో మూడు భాగాలుగా విభజించి ఒక భాగం పేద ప్రజలకు, రెండో భాగం బంధువులకు, మూడో భాగంతమ కుటుంబీకులకు పంచుతారు. ఈ పర్వదినాన సమస్త మానవాళికి శాంతిని ప్రసాదించాలని ఆ అల్లాను ప్రార్థించారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు అలింగనం చేసుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో... జామా మసీద్ కమిటీ సభ్యులు, ముస్లిం మత గురువులు , మత పెద్దలు, మండలంలోని ముస్లిం సోదరులందరూ పాల్గొన్నారు.

## బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న సర్పంచ్ కుంజా వినోద్



**ములకలపల్లి, మే 28 ప్రజాజ్యోతి:** జగన్నాథపురం ఈద్గా వద్ద గురువారం నిర్వహించిన బక్రీద్ వేడుకల్లో జగన్నాథపురం సర్పంచ్ కుంజా వినోద్ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక నమాజ్‌లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకొని ఈదుల్ ఉల్ అజ్హా శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో సోదరభావం, ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సోయం బోడప్ప, మీడియం నారాయణ, రామాచారి, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జానీ, కూరం రామకృష్ణ, ముస్లిం మత పెద్ద ఎండి ఉస్మాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు

# మొక్కజొన్న కొనుగోలులో ప్రభుత్వం విఫలం

- బకాయిల జాప్యంతో అల్లాడుతున్న మొక్క రైతులు
- బకాయిలను తక్షణమే విడుదల చేయాలి .
- తెలంగాణ రైతు సంఘం



**గుండాల. మార్చి 228. ప్రజా జ్యోతి** మొక్కజొన్న కొనుగోలులో ప్రభుత్వం విఫలమైందని దీంతో రైతులు దళారుల వద్ద మోసపోతున్నారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి మూడ్ శోభన్ పేర్కొన్నారు గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక రైతు వ్యవసాయ పరపతి సంఘం పిఎసిఎస్ కేంద్రాన్ని ఆ సంఘం నాయకులు సందర్శించిన అనంతరం విడుదలచిన ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. అక్కడున్న రైతులతో ఆ సంఘం నాయకులు మాట్లాడారు ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించడంలో జ్ఞాపకం జరుగుతుందని తద్వారా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సొసైటీకి తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో జాప్యంతో పాటు గోదామాలకు తరలించడంలో తీవ్రమైన జ్ఞాపకం జరగడంతో రైతు ఖాతాలోకి డబ్బులు రావడం లేదని, ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పండించిన పంట నుండి ఎకరానికి కేవలం 24 కింపు వాళ్ళు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, మిగతా ధాన్యాన్ని దళారుల వద్ద అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొందని దీని ద్వారా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. ఎంతో కొంత కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైతులకు చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని ఇప్పటికైనా రైతు ఖాతాలో డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఎసిఎస్ సెంటర్లలో రైతులు మొక్కజొన్న ధాన్యాన్ని విలువ చేసి కాపాడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని ఆ ధాన్యాన్ని గోడౌన్లలోకి తరలించి రైతు కష్టాలను గుర్తించాలని, రైతులు పండించిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద కోనే సంచుల కొరత, రవాణా లారీల కొరత రైతులను తీవ్రంగా వేధిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అమాలి కాంట్రాక్టర్ల బిల్లులు పెండింగులో ఉన్నందున వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారు సైతం నిరసనలకు దిగుతున్నారని అన్నారు. రైతులు పండించిన ప్రతి పంటను చివరి గింజ వరకు కొంటామని పేపర్ల ప్రకటనలకే పరిమితం అవుతుందని, అమలులో పూర్తిగా విఫలమవుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం రైతు పండించిన పంటను కొనుగోలు చేసి సకాలంలో డబ్బులు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ జిల్లా నాయకులు శంకరన్న గుర్రాల నాగన్న, తోలేం గోపి, తోలేం భూపాల్, దుగ్గి రామ్మూర్తి, బాగబోయిన నరసింహారావు, గడ్డం కృష్ణ, ఎర్రం రామకృష్ణ, కల్తీ సమ్మయ్య, కల్తీ శేఖర్, జోగా రాజేష్, కల్తీ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## నూతన దంత వైద్యశాల ప్రారంభం

- నాణ్యమైన దంత వైద్యం అందించాలి
- ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు





**చర్ల, మే 28 (ప్రజా జ్యోతి):** చర్లలోని రఘు థియేటర్ రోడ్డులో డాక్టర్ పెద్దాడ గీతానంద్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ ధన్వంతరి డెంటల్ హాస్పిటల్‌ను గురువారం భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమని అన్నారు. ప్రజలకు నాణ్యమైన దంత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఆసుపత్రిని ఏర్పాటు చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. ఆధునిక సౌకర్యాలతో ప్రజలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వైద్య పరికరాలు, చికిత్స గదులను ఎమ్మెల్యే పరిశీలించి వైద్య సిబ్బందితో మాట్లాడారు. ప్రజలకు అందుబాటు ధరల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చర్ల మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మండల ప్రజలు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## కేరళలో బీజేపీ, కాంగ్రెస్ అపవిత్ర కలయిక బట్టబయలైంది

- సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



**బూర్గంపహాడ్, మే 28 (ప్రజా జ్యోతి ):** కేరళ రాష్ట్రంలో బీజేపీ కాంగ్రెస్ ల మధ్య అపవిత్ర కలయిక బట్టబయలైందని సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. కేరళ రాష్ట్రంలో మాజీ సీఎం పినరయి విజయన్, సీపీఎం నేతల ఇళ్లలో ఈడీ సోదాలు నేపథ్యంలో సీపీఎం దేశవ్యాప్త పిలుపులో భాగంగా గురువారం మండల పరిధిలోని సారపాకలో సీపీఎం నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీపీఎం కుటుంబాలు 10 ఇళ్లలో ఈడీ సోదాలు నిర్వహించి అల్లకల్లోలం సృష్టించారని దీనికి ప్రజలు తిరుగుబాటు చేశారన్నారు. కేంద్రంలో బీజేపీకి ఎదురొడ్డి పోరాడేది సీపీఎం మాత్రమేనని సీపీఎంను దేశంలో లేకుండా చేయడానికి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కాంగ్రెస్తో కలిసి సీపీఎం కుటుంబాలపై దాడులకు దిగుతున్నాడని. ఈ చర్యలు దారుణమన్నారు. ప్రజాసమస్యలపై పోరాడే సీపీఎం నేతల ఇళ్లపై దాడులకు దిగుతున్నారని... రానున్న కాలంలో ప్రజలే కేంద్రంలో బీజేపీకి బుద్ధిచెబుతారని ప్రజలు కూడా ఈ ప్రజా పోరాటానికి సిద్ధమవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు పాపినేని సరోజిని, ఎస్.అబిద, కవులూరి నాగమణి, పాషా, హుస్సేన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుక



**చర్ల, మే 28:(ప్రజా జ్యోతి ):** చర్లలో తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక, మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ సినీనటుడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) 103వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి, విగ్రహానికి పార్టీ నాయకులు కార్యకర్తలు పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టిడిపీ నాయకులు రేగళ్ల సుధాకర్ మాట్లాడుతూ తెలుగు జాతి గర్వకారణమైన ఎన్టీఆర్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. సినీ రంగంలో ఎన్నో విశిష్ట పాత్రలతో ప్రజలను అలరించిన ఆయన, రాజకీయాల్లోకి వచ్చి పేద ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని కొనియాడారు. తెలుగు ప్రజలకు ఆత్మగౌరవాన్ని తీసుకు వచ్చిన మహానేత ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రేగళ్ల సుధాకర్ ,ఎడ్ల సత్తిబాబు ,వెంకటనారాయణ , కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

- తెలుగు జాతి గర్వకారణం ఎన్టీఆర్

**టేకులపల్లి, మే28, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం బోడు గ్రామంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు మాట్లాడుతూ.. తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహానేత ఎన్టీఆర్ అని కొనియాడారు. సినీ రంగంలోనే కాకుండా రాజకీయాల్లో కూడా చెరగని ముద్ర వేసిన నాయకుడిగా ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాజకీయాల్లోకి వచ్చిన ఆయన సామాన్య ప్రజలకు ఆత్మవిశ్వాసాన్ని నూరిపోశారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మసిపాక రామస్వామి, కొలుకూరి రవిశంకర్, రేఖ రామచందర్, చిలువేరు నాగేశ్వరరావు , ఇరప సమ్మయ్య, పూనెం కృషయ్య, గంగాధర్ బాబు గ్రామస్తులు పాల్గొన్నారు.



## పాతకొత్తగూడెంలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు





**కొత్తగూడెం, మే 28 ( ప్రజాజ్యోతి )** తెలుగు ప్రజల ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిన మహానేత ఎన్టీఆర్ అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు. గురువారం పాతకొత్తగూడెంలో మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ మూగ గణేష్ కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. రూ.2కే కిలో బియ్యం, జనతా వస్త్రాలు వంటి పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన నాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ప్రజలనే దేవుళ్లుగా భావించి పనిచేసిన ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, రామారావు, భవానీప్రసాద్, సాంబిరెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టుల పేలుడు సామగ్రి స్వాధీనం







- మావోయిస్టుల ఆయుధ తయారీ కేంద్రం ధ్వంసం
- భారీగా ఆయుధాలు,పేలుడు పదార్థాలు స్వాధీనం

**చర్ల , మే 28 :(ప్రజా జ్యోతి):** తెలంగాణ సరిహద్దు రాష్ట్రమైన మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా పోలీసులు ,ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ పోలీసులతో కలిసి నిర్వహించిన సంయుక్త అంతర్రాష్ట్ర ఆపరేషన్‌లో మావోయిస్టుల ఆయుధ తయారీ కేంద్రాన్ని ధ్వంసం చేశారు. లొంగిపోయిన మావోయిస్టుల నుంచి అందిన గోప్య సమాచారంతో ఈ ప్రత్యేక ఆపరేషన్ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.గడ్చిరోలి జిల్లా మావోయిస్టు ప్రభావం నుంచి దాదాపు విముక్తి పొందుతున్న నేపథ్యంలో మావోయిస్టులు భద్రతా బలగాలపై దాడులకు ఉపయోగించే ఆయుధాలు, పేలుడు పదార్థాలను అటవీ ప్రాంతాల్లో రహస్యంగా తయారు చేసి భూగర్భంలో దాచిపెడుతున్నట్లు సమాచారం అందిందని వెల్లడించారు. ఈ మేరకు మే 26న గడ్చిరోలి ఎస్పీ ఎం. రమేష్ పర్యవేక్షణలో ప్రత్యేక దళాలు, డీఆర్‌జీ బృందాలు, బాంబు నిర్వీర్య దళాలు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించాయి. మే 27న నారాయణపూర్ జిల్లా కాకూర్ పోలీస్ స్టేషన్ పరిధికి సమీపంలోని అటవీ ప్రాంతంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టగా భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, ఆయుధ తయారీ సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాటిలో ఒక ఇన్సాస్ రైఫిల్, రెండు సింగిల్ షాట్ రైఫిళ్లు, రెండు 12 బోర్ రైఫిళ్లు, 18 జీవంత కార్ట్రిడ్జ్‌లు, 25 కిలోల ఐఈడీ పేలుడు పదార్థం, రెండు క్లేమోర్లు, 110 డెటోనేటర్లు, కార్టెక్స్ వైర్లు, బీజీఎల్ సెల్స్, బీజీఎల్ లాంచర్లు, ట్యూబ్ లాంచర్లు, లేథ్ మిషన్లు, మోటార్లు, గ్రైండర్ యంత్రాలు, ఇన్వర్టర్లు, బ్యాటరీలు, వైర్ బండిల్స్, సోలార్ ప్లేట్లు తదితర సామగ్రి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.స్వాధీనం చేసుకున్న మావోయిస్టుల ఆయుధ తయారీ సామగ్రిని భద్రతా దళాలు సంఘటన స్థలంలోనే ధ్వంసం చేశాయి. ఈ ఆపరేషన్ ద్వారా మావోయిస్టుల కార్యకలాపాలకు భారీ దెబ్బ తగిలిందని గడ్చిరోలి పోలీసులు పేర్కొన్నారు.

# రూ.1.50 కోట్లతో చింతల చెరువు అభివృద్ధి

- వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తాం : కూనంనేని



**చుంచుపల్లి, మే 28 ( ప్రజాజ్యోతి )** చుంచుపల్లి మండలం విద్యానగర్ పంచాయతీ పరిధిలోని చింతల చెరువు చుట్టూ రూ.1.50 కోట్లతో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. గురువారం ఆయన చింతల చెరువును సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెరువు అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే ప్రభుత్వానికి పంపామని, అనుమతులు కూడా మంజూరయ్యాయని చెప్పారు. నిధులు విడుదలైన వెంటనే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. చింతల చెరువును ఆధునీకరించి, మరింత సుందరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు ఆహ్లాదంగా గడిపేలా వాకింగ్ ట్రాక్‌తో పాటు మెరుగైన వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వాసిరెడ్డి మురళి, సర్పంచ్ శాంతి శ్రీ, భాగం నాగమణి, మాధవరావు, తాటి కృష్ణవేణి, ఏపూరి కృష్ణమూర్తి, కె.రామారావు, కృష్ణ, నర్సింహారావు, సురేష్, గంగయ్య, భద్రం, ప్రసాద్, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి అవమానం

- చెత్త కుప్పలో బలహీన వర్గాల దేవుడు అంబేద్కర్ విగ్రహం
- నల్ల బ్యాడ్జిలతో నిరసన....
- దళిత సంఘాల గుండెల్లో వేదన

**అశ్వాపురం : మే 28, ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం తొలగింపు గత మూడు రోజుల క్రితం ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత డా. బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని అర్ధ రాత్రి పోలీస్ బలగాల నడుమ అధికారులు ఇష్టం వచ్చినట్లు విగ్రహాన్ని జేసీబీ తో లాక్కొని R and B కార్యాలయం పక్కన ఉన్న చెత్తలో వాడేయడం దుర్మార్గమైన చర్యగా గుర్తించి... దానికి నిరసనగా రోజు వారి కార్యక్రమంలో బాగంగా మూడోవ రోజు దళిత సంఘాల ఆధ్వర్యంలో చెత్తకుప్పలో పడేసిన విగ్రహం దగ్గర నుండి ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహం పెట్టిన ప్రధాన కూడలిలో నల్ల బ్యాడ్జిలతో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది... అనంతరం దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ... అంబేద్కర్ విగ్రహం ఎక్కడైతే తీశారో మళ్ళీ అదే స్థానంలో పెట్టే అంతవరకూ నిరంతరం ఉద్యమాలు చేస్తామని అన్నారు... ఈ కార్యక్రమంలో ఇసంపల్లి కృష్ణ, గద్దల నాగేశ్వరరావు, చెట్టి సురేష్, గద్దల రామకృష్ణ, మద్దెల అన్నపూర్ణ, తోటమళ్ళ నిర్మల, మేకల భాస్కర్, రాజేష్, జూపెల్లి ధ్రువ కుమార్, మిరియాల బాలకృష్ణ,కాలవ విజయ రాజు, రవి, తదితరులు పాల్గొన్నారు.



# పశువుల దొంగల పట్టివేత



**చర్ల, మే 28:(ప్రజా జ్యోతి):** చర్ల మండలం పెద్దపల్లి గోదావరి నది పరిసర ప్రాంతంలో అక్రమంగా పశువులను తరలిస్తున్న ఇద్దరు యువకులను గ్రామస్తులు పట్టుకుని చర్ల పోలీసులకు అప్పగించిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం, తిమ్మిరిగూడెం గ్రామానికి చెందిన 13 పశువులను గుంపెనగూడెం గ్రామానికి చెందిన వ్యక్తులు అక్రమంగా తరలించేందుకు యత్నించినట్లు తెలిసింది. ఈ క్రమంలో పశువులను గోదావరి నది మార్గంగా మణుగూరుకు తీసుకెళ్తుండగా లింగాల, గొమ్ముగూడెం గ్రామస్తులు అనుమానంతో వారిని అడ్డుకుని ప్రశ్నించారు. విచారణలో పశువులను దొంగతనంగా తరలిస్తున్న విషయం బయటపడింది. పట్టుబడిన ఇద్దరు యువకులు తాము దినసరి కూలీలమని, పశువులను మణుగూరుకు తరలిస్తే అధిక మొత్తంలో డబ్బులు ఇస్తామని చెప్పడంతో ఈ పనికి ఒప్పుకున్నామని గ్రామస్తుల ఎదుట తెలిపారు. దీంతో ఆగ్రహానికి గురైన పశు యజమానులు, గ్రామస్తులు వారిని నిలదీశారు.అనంతరం ఘటనపై చర్ల పోలీసులకు సమాచారం అందించారు. పశువుల దొంగతనానికి పాల్పడిన అసలు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని గతంలో చోరీకి గురైన పశువుల ఘటనలపై కూడా సమగ్ర విచారణ చేపట్టాలని పశు యజమానులు కోరుతున్నారు .

# సింగరేణి దోపిడీకి చెక్ పెట్టాలి

- గిరిజన హక్కుల సాధన కోసం జూన్ 2న కొత్తగూడెంలో మహా ధర్నా
- గిరిజనులకు పూర్తి స్థాయి ఉద్యోగ రిజర్వేషన్ అమలు చేయాలి : రాజేష్ నాయక్



**టేకులపల్లి,మే 28ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం మద్రాస్ తండా కొండంగులబోడులో గురువారం నిర్వహించిన సమావేశంలో లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్టీ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ రాజేష్ నాయక్ మాట్లాడుతూ, జూన్ 2న కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని సింగరేణి ప్రభావిత ప్రాంత ప్రజలకు పిలుపు నిచ్చారు.ఏజెన్సీ ప్రాంతంలోని సింగరేణి సంస్థలో 1997 సమతా తీర్పు, 1996 పీసా చట్టం ప్రకారం గిరిజనులకు ఉద్యోగాలలో 100 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కోయగూడెం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్‌లో జరుగుతున్న బాంబు పేలుళ్ల కారణంగా ఇళ్లకు పగుళ్లు వచ్చి కూలిపోయే పరిస్థితులు నెలకొన్నాయని, దుమ్ము ధూళి కాలుష్యంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బాంబు పేలుళ్లను నిలిపివేసి యంత్రాల ద్వారా బొగ్గు తవ్వకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని, సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. ఓపెన్ కాస్ట్ గనుల కారణంగా చెరువులు ఎండిపోవడం, వ్యవసాయ భూములు బీడు భూములుగా మారడం, రైతులు జీవనోపాధి కోల్పోవడం, పశువులకు నీరు, పశుగ్రాసం దొరకకపోవడం వంటి సమస్యలు తీవ్రరూపం దాల్చాయని తెలిపారు. ఓపెన్ కాస్ట్ గనులను నిలిపివేసి భూగర్భ గనులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.స్థానిక యువతకు ఉద్యోగాలు వస్తాయని ఆశించినప్పటికీ, ఇతర రాష్ట్రాల కార్మికులను కాంట్రాక్టర్ల ద్వారా నియమించుకోవడం వల్ల స్థానికులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడం విచారకరమన్నారు.ఏజెన్సీ ప్రాంతంలోని కోయగూడెం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్‌లో కాంట్రాక్టు పనులు పొందిన సంస్థలు సమతా తీర్పు ప్రకారం ప్రభావిత ప్రాంత గిరిజనులకు 100 శాతం ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో సెక్యూరిటీ గార్డుల కాంట్రాక్టులు పొందిన గిరిజనేతర సంస్థల లైసెన్సులను రద్దు చేసి గిరిజనులకు మాత్రమే కేటాయించాలని కోరారు. సింగరేణి ఉత్పత్తిలో 43 శాతం బొగ్గు ఏజెన్సీ ప్రాంత గనుల నుంచే లభిస్తున్నందున, సంస్థ లాభాల్లోని సామాజిక బాధ్యత నిధుల్లో 43 శాతం గిరిజన గ్రామాల అభివృద్ధికి కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కుశ్ నాయక్, నాగేశ్వరరావు, లచ్చు నాయక్, వీరన్న నాయక్, సుందర్ నాయక్, చందర్ నాయక్, వీరు నాయక్, భాస్కర్ నాయక్, స్వామి నాయక్, సోమ్లా నాయక్, భీమా నాయక్ తదితరులు పాల్గొన్నారు.